A9 NEWS TELANGANA

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 09 గురువారం 02 ఏప్రిల్ 2026 పేజీలు :08 వెల:రూ.5/-

## బోణీ కొట్టిన ఢిల్లీ!



2 లో..

## అపోహలు, మోసాలపై అలర్ట్..

# రాష్ట్రాలకు మోదీ దిశానిర్దేశం

## యుద్ధ ప్రభావం.. రాష్ట్రాలకు మోదీ కీలక ఆదేశాలు

మన ప్రజాగళం, న్యూఢిల్లీ

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలో ఆర్థిక స్థిరత్వం, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలపై ప్రధాని నరేంద్ర మోదీ సమగ్ర సమీక్ష నిర్వహించారు. కేంద్రంరాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలపై ప్రభావం తగ్గించే దిశగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ..పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అమెరికాఇజ్రాయెల్ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం



అప్రమత్తమైంది. దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ముఖ్యంగా ఇంధనఆహార సరఫరాలపై పడే ప్రభావాన్ని అంచనా వేయడానికి ప్రధాని మోదీ అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దేశ భద్రతకు సంబంధించిన కీలక వేదిక అయిన క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు. యుద్ధ పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్ చర్యలపై చర్చలు జరిగాయి. పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ఆర్థిక, వాణిజ్య స్థిరత్వాన్ని కాపాడటం, ఇంధన భద్రతను నిర్ధారించడం, ప్రజల ప్రయోజనాలను రక్షించడం, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యంగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలకులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో దేశ సిద్ధతపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో కేంద్రంరాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు అమలయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్రాలు కేంద్రంతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, నేలస్థాయిలో నిర్ణయాలను వేగంగా అమలు

మిగతా 2 లో..

## త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగిస్తాం..

### మాకు ఏ డీల్ అవసరం లేదు: డొనాల్డ్ ట్రంప్



మన ప్రజాగళం, న్యూఢిల్లీ

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని త్వరలో ముగిస్తామని, అందుకు ప్రత్యర్థి దేశంతో ఎలాంటి ఒప్పందం చేసుకోవడం లేదని అమె?రాకా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. గత నెల రోజుల నుంచి ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధానికి మరో రెండు, మూడు వారాల్లో స్వస్తి పలుకుతామని ప్రకటించారు. మంగళవారం ఓవల్ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన డొనాల్డ్ ట్రంప్ 'అనుకున్న లక్ష్యాలు దాదాపు పూర్తి చేశాం. మేం సాధ్యమైనంత త్వరగా ఇరాన్ నుంచి నిష్క్రమిస్తున్నామం. ఈ ఉపసంహరణ ప్రక్రియ కేవలం 2, 3 వారాల్లోనే పూర్తవుతుందని' ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేసిన ఇరాన్‌తో తమ యుద్ధాన్ని ముగించేందుకు తాము ఇరాన్‌తో ఎలాంటి అధికారిక ఒప్పందం చేసుకోవడం లేదని తెలిపారు. ఇరాన్ దేశం అణ్వాయుధాలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని కోల్పోయేలా చేయడమే తమ లక్ష్యమని, అది పూర్తి చేసిన వెంటనే అమెరికా బలగాలు వెనక్కి వచ్చేస్తాయని స్పష్టం చేశారు.

మిగతా 2 లో..

## అమెరికాపై స్పెయిన్ ఆగ్రహం!



2 లో..

## చికెన్ షాపులన్నీ బంద్

మన ప్రజాగళం, హైదరాబాద్.

తెలంగాణలో చికెన్ షాపులన్నీ మూతపడ్డాయి. అందరూ ఐక్యంగా ఒకే మాట మీద ఉండి మూసేశారు. వ్యాపారులు, పౌల్ట్రీ యాజమాన్యాల మధ్య ఏర్పడిన వివాదమే కారణం. హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు. ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్ కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు.



మిగతా 2 లో..

## కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య చీకటి ఒప్పందం



2 లో..

# రెండు నెలలకు సరిపడా చమురు నిల్వలు!

### సామాన్యులపై భారం వేసే ఆలోచన లేదు!కేంద్రం కీలక ప్రకటన



మన ప్రజాగళం, న్యూఢిల్లీ

భారత్‌లో 2నెలలకు సరిపోయే నిల్వలు ఉన్నాయని పెట్రోలియం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇప్పుడు క్రూడ్ ఆయిల్ దొరకడం ఇబ్బంది అవుతున్నా ప్రజలపై భారం వేయదలుచుకోలేదని స్పష్టం చేసింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వేళ దేశంలో ముడి చమురు సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదని కేంద్రం ప్రకటించింది. రాబోయే రెండు నెలల అవసరాలకు సరిపోయే నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, గ్యాస్ మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. బుధవారం జరిగిన సమావేశంలో మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ మాట్లాడుతూ, దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు, వాటి పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని వెల్లడించారు. రిటైల్ అవుట్‌లెట్‌లలో లేదా

మిగతా 2 లో..

## 1.40 లక్షల మందికి

# రేషన్ కార్డు కట్..

మన ప్రజాగళం, హైదరాబాద్.

తెలంగాణలోని రేషన్ కార్డులకు సంబంధించి కేంద్రం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. ఏకంగా 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసింది. దీంతో వీరికి రేషన్ కట్ అయింది. అర్హత లేకపోయినా రేషన్ పొందుతున్నారనే ఉద్దేశంతో రేషన్ కార్డులు కట్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రేషన్ కార్డుల్లో పారదర్శకత తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. కొంతమందికి అర్హత లేకపోయినా రేషన్ కార్డులు పొందుతున్నారు. అక్రమ మార్గంలో రేషన్ కార్డులను పొందుతున్నారు. ఇలాంటి వారిని నివారించి నిజమైన అర్హులకు మాత్రమే లబ్ది చేకూర్చాలనే ఉద్దేశంతో కేంద్రం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రేషన్ కార్డుల రీవెరిఫికేషన్ చేపట్టి



అనర్హులను తొలగిస్తోంది. ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 1.40 లక్షల మంది రేషన్ కార్డులను రద్దు చేసింది. అనర్హులగా తేలడంతో వీరికి రేషన్ కార్డు కట్ చేసింది. అటు ఏపీలో 102 రేషన్ కార్డులు రద్దు చేసింది.

### 41 లక్షలకుపైగా రేషన్ కార్డులు కట్

పార్లమెంట్‌లో రేషన్ కార్డుల అంశంపై కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ సహాయమంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా కీలక ప్రకటన చేశారు. దేశంలో 41 లక్షలకుపైగా అక్రమ రేషన్ కార్డులను తొలగించినట్లు వెల్లడించారు. ఇక దేశంలో 5.51 లక్షల రేషన్ షాపుల్లో ఆధార్ బయోమెట్రిక్ ద్వారా రేషన్ సరుకులను తీసుకునే విధానం ప్రవేశపెట్టామని, దీని వల్ల సరుకుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడిందని స్పష్టం చేశారు. జీఎస్టీ, కార్పొరేట్ వ్యవహారాలు, జాతీయ రహదారులు, ఇన్ కమ్ ట్యాక్స్ శాఖల సమాచారం ఆధారంగా రేషన్ కార్డులను తొలగించినట్లు తెలిపారు. రాజస్థాన్‌లో అత్యధికంగా 6 లక్షలకుపైగా కార్డులను కట్ చేశారు. అటు ప్రజా పంపిణీకి సంబంధించిన డేటా బేస్‌ను ఇతర సంక్షేమ పథకాలతో లింక్ చేసే ప్రతిపాదన కేంద్రం దగ్గర లేదని జయంతిభాయ్ బాంభావియా పార్లమెంట్‌లో పేర్కొన్నారు.

### పెరిగిన రేషన్ కార్డులు

ఇక తెలంగాణలో రేషన్ కార్డులు

మిగతా 2 లో..

విలేఖరులు కావలెను

విశేష ఆదరణతో దూసుకుపోతున్న ......" మన ప్రజాగళం " తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేఖరులు కావలెను. వివిధ మండలాల వారీగా, జిల్లాల వారీగా స్టాఫర్లు, మరియు ఆర్.సి.ఇన్‌ఛార్జులు,రిపోర్టరు, కావలెను.

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

సంప్రదించవలసిన ఫోన్ నెం.

93908 75876,75695 75083

## అపోహలు, మోసాలపై అలర్ట్..

# రాష్ట్రాలకు మోదీ దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలని తెలిపారు.ప్రజలకు అవసరమైన వస్తువుల సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాలని, వాటిని దాచిపెట్టి ధరలు పెంచే చర్యలను కఠినంగా అరికట్టాలని రాష్ట్రాలకు సూచించారు. సరఫరా వ్యవస్థలు సజావుగా నడవడం కీలకమని పేర్కొన్నారు. ఇదే సమయంలో వ్యవసాయ రంగంపై కూడా దృష్టి సారిస్తూ, ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అపోహలు వ్యాప్తి చెందకుండా నిజమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని ప్రధాని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం వల్ల భయాందోళనలు పెరగవచ్చని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలను సూచించారు.ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రులు అభినందించారు. మొత్తం మీద, ఈ సమావేశంలో ప్రజలపై ప్రభావం తగ్గించే దిశగా సమన్వయంతో పనిచేయడం, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం, సరఫరా వ్యవస్థలను కాపాడడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టారు.ఫిబ్రవరి 28న ప్రారంభమైన పశ్చిమ ఆసియా ఘర్షణలపై ఇది రెండోసారి నిర్వహించిన సీసీఎస్ సమావేశం. మార్చి 22న జరిగిన తొలి సమీక్షలో కూడా ఇదే అంశాలపై చర్చించారు. ముఖ్యంగా దేశంలో అవసరమైన సరఫరాలు హారం, ఇంధనం, గ్యాస్ లాంటి అంతరాయం లేకుండా కొనసాగాలని ప్రధాని స్పష్టం చేశారు. పంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో, భారత్ అవసరమైన ఇంధనాన్ని పలు దేశాల నుంచి సమీకరించే దిశగా చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో వచ్చే అంతరాయాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కూడా ప్రధాని మోదీ ప్రస్తుత పరిస్థితులను సవాలుగా అభివర్ణించారు. సంక్షోభ సమయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేస్తూ, అపోహలు వ్యాప్తి చేస్తే దేశానికి నష్టం కలుగుతుందని హెచ్చరించారు. మొత్తంగా, పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న వేళ, భారత్ ముందస్తు చర్యలతో పరిస్థితిని ఎదుర్కొనే దిశగా కసరత్తు చేస్తోంది. ప్రజలపై ప్రభావం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగిస్తాం..

(మొదటి పేజీ తరువాయి..)

బాధ్యతను ఇకపై అమెరికా తీసుకోబోదని, ఆ మార్గాన్ని ఉపయోగించే ఫ్రాన్స్ వంటి ఇతర దేశాలే ఆ బాధ్యతలు చూసుకోవాలని పేర్కొన్నారు.ఇరాన్ కుప్పకూలింది.. నెతన్యాహు..

ఇజ్రాయెల్ ప్రధాని బెన్యామిన్ నెతన్యాహు సైతం ఇరాన్‌తో యుద్ధంపై స్పందించారు. అమెరికా–ఇజ్రాయెల్ కొనసాగించిన సంయుక్త దాడులతో ఇరాన్ నాశనమైందని, వారి సుప్రీం లీడర్ ఖమేనీని తొలి రోజుల్లోనే అంతం చేశామన్నారు. ప్రస్తుతం ఇరాన్ కుప్పకూలుతోందని, ఇరాన్ సైన్యం కోసం ఖర్చు చేసిన ట్రిలియన్ డాలర్లు వృధా అయ్యాయని పేర్కొన్నారు. ఇరాన్ సైన్యం, ప్రభుత్వం గతంలో కంటే బలహీనపడిందని, మిడిల్ ఈస్ట్‌లో కొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయని నెతన్యాహు ధీమా వ్యక్తం చేశారు. అమెరికా నుండి ఇరాన్‌కు సందేశాలను పంపుతున్నది ఎవరు? అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘచీ కీలక ప్రకటన చేశారు. అమెరికా నుండి నేరుగా సందేశాలు అందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని అర్థం టెహ్రాన్ వాషింగ్టన్‌తో 'చర్చలు' జరుపుతున్నట్లు కాదని ఆయన స్పష్టం చేశారు.అరాఘ్చీ ఏమన్నారు?

అల్ జజీరాతో మాట్లాడిన ఇరాన్ విదేశాంగ మంత్రి.. గతంలో లాగే నాకు స్టీవ్ విట్‌కాఫ్ నుండి సందేశాలు వస్తున్నాయి. కానీ దాని అర్థం మేము చర్చలు జరుపుతున్నామని కాదు. అమెరికా పంపిన 15 సూత్రాల ప్రతిపాదనలకు ఇరాన్ స్పందించలేదు. ఎటువంటి షరతులు విధించలేదు. ఇరాన్ ఈ ప్రాంతం మొత్తంలో యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా ఉంది. తాత్కాలిక కాల్పుల విరమణకు కాదు. అమెరికాతో చర్చలు జరపడంపై ఇరాన్‌కు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని' ఆయన పేర్కొన్నారు.అమెరికా ఇరాన్‌లోని ఏ పక్షంతోనైనా చర్చలు జరుపుతోందన్న వాదనలో నిజం లేదని అరాఘ్చీ పునరుద్ఘాటించారు. అన్ని సందేశాలు విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారానే పంపుతారని లేదా స్వీకరిస్తారని, భద్రతా సంస్థల మధ్య కమ్యూనికేషన్ ఉంటుందని తెలిపారు. అమెరికాతో చర్చల అనుభవం ఎప్పుడూ బాగుండలేదని అరాఘ్చీ అన్నారు. కొన్ని ఏళ్ల కిందట అమెరికాతో ఒక ఒప్పందం చేసుకున్నాం, కానీ యూఎస్ దాని నుండి వెనక్కి తగ్గిందని ఆయన గుర్తు చేశారు.యుద్ధం ముగింపుపై ఇరాన్ అధ్యక్షుడి సంకేతాలు

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పేజెష్కియాన్ కూడా తాజాగా మాట్లాడుతూ, అమెరికాకు దౌత్యంపై నమ్మకం లేదన్నారు. యూఎస్‌తో చర్చలు జరుగుతున్న సమయంలో కూడా ఇరాన్‌పై రెండుసార్లు దాడి జరిగిందని పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడితో జరిగిన చర్చల్లో, ఇరాన్ ఈ సంఘర్షణను పొడిగించాలని అనుకోవడం లేదని పేజెష్కియాన్ తెలిపారు. మేం యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా ఉన్నాం, అయితే ఇరాన్ భద్రతకు భరోసా కావాలి. భవిష్యత్తులో జరిగే దాడులను అరికట్టడానికి గ్యారెంటీ ఇవ్వాలని అన్నారు. ఇరాన్ ప్రజల ప్రయోజనాలు, భద్రతకు హామీ లేకుండా ఎలాంటి ఒప్పందాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు.

# అమెరికాపై స్పెయిన్ ఆగ్రహం!

(మొదటి పేజీ తరువాయి..)

రెండోసారి మోసం చేయలేరని కామెంట్! గగనతలాన్ని వాడుకోవద్దని సూచన!

మధ్య ప్రాచ్యంలో ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధంలో అంతర్జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అమెరికాకు అత్యంత సన్నిహితంగా ఉండే దేశాలు సైతం హ్యాండ్ ఇస్తున్నాయి. తాజాగా స్పెయిన్ ట్రంప్ ప్రభుత్వానికి ఝలక్ ఇచ్చింది. ఇరాన్‌పై దాడుల విషయంలో తాము సహకరించలేమని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టం చేశారు. ఇరాక్ జరిగిన మోసాన్ని ఇప్పుడు కూడా జరగనివ్వబోమని తేల్చి చెప్పారు.

ఇరాన్‌పై దాడులకు గగనతలాన్ని వాడుకోవద్దని స్పెయిన్ సూచన

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను స్పెయిన్ తప్పుపట్టింది. తమ సహకారం ఉండబోదని తేల్చి చెప్పింది. అంతే కాకుండా తమ గగనతలాన్ని యుద్ధ విమానాల కోసం వాడుకోవద్దని కూడా తేల్చి చెప్పింది. మూసివేస్తున్నట్టు వెల్లడించింది. అంతేకాకుండా, స్పెయిన్ భూభాగంలో ఉన్న ఉమ్మడి సైనిక స్థావరాలను యుద్ధ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవడానికి లేదని స్పష్టం చేసింది. స్పెయిన్ రక్షణ మంత్రి మార్గరీటా రోబ్లెస్ మాట్లాడుతూ, ఇరాన్ యుద్ధానికి సంబంధించి ఏ రకమైన సహకారాన్ని తాము అందించబోమని ఇది తమ దేశ విధానమని తేల్చి చెప్పారు.

ఇరాక్‌తో యుద్ధంలో ఇవే చెప్పే మోసం చేశారంటున్న స్పెయిన్

స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ మాట్లాడుతూ 23 ఏళ్ల నాటి ఘటనలు ప్రస్తావించారు. ఇరాక్ యుద్ధం సమయంలో ఇప్పటి మాదిరిగానే తమను అమెరికా యుద్ధంలోకి లాగిందని గుర్తు చేసింది. అప్పుడు కూడా భారీ విధ్వంసకర ఆయుధాలు ఉన్నాయని 2003లో ఇరాక్‌పై దాడికి ఉసిగొల్పిందని వివరించారు. దాడి జరిగిన తర్వాత చూస్తే అలాంటి ఆనవాళ్లే లేవని తేలిందన్నారు. అందుకే మరోసారి అమెరికా చేతిలో మోసపోవడానికి సిద్ధంగా లేమని కుండబద్దలు కొట్టారు. ఇప్పుడు ఇరాన్‌పై కూడా అలాంటి సాకులతోనే దాడులు చేస్తున్నారని ఇది ప్రమాదకరమైన చర్యగా అభివర్ణించారు.

స్పెయిన్ స్పందనను ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆగ్రహంతో ఉన్న ట్రంప్ స్పెయిన్ ప్రవర్తన బాగాలేదని అన్నారు. ఆ దేశంతో ఉన్న అన్ని వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నామని ప్రకటించారు.

స్పెయిన్ గగనతలం మూసివేతతో అమెరికాకు వచ్చిన నష్టమేంటి?

స్పెయిన్ తన గగనతలాన్ని మూసివేయడంతో అమెరికాకు చెందిన ప్రమాదకరమైన బీ 52, బీ1 బాంబర్ విమానాల తరలింపునకు ఆటంకం ఏర్పడింది. ఇప్పుడు ఇంగ్లండ్ మీదుగా తరలించాల్సి వస్తోంది. ఇది వ్యూహాత్మకంగా భారీ నష్టం చేస్తుందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది.

అమెరికాకు దూరం దూరం

ఇప్పటికే నాటో కూటమిలో ఉండాలా వద్దా అని అమెరికా ఆలోచిస్తోంది. తమ అవసరాల కోసం అమెరికాను వాడుకుంటున్న నాటో దేశాలు అవసరమైనప్పుడు అమెరికాకు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నిస్తోంది. ఇది నాటో దేశాల మధ్య పెరుగుతున్న దూరాన్ని సూచిస్తోంది. ఇప్పుడు స్పెయిన్ కూడా వ్యతిరేకంగా ఉండటంతో ఈ ప్రభావం యూరోపియన్ దేశాలపై కూడా ప్రభావం చూపబోతోంది. బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ కూడా ఇది తమ యుద్ధం కాదని కామెంట్ చేశారు. మొత్తం మీద అమెరికా, ఐరోపా దేశాల మధ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్టు కనిపిస్తోంది.



# చికెన్ షాపులన్నీ బంద్

(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యంగా హైదరాబాద్‌లోని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు.

సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, ఈ సమ్మె మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది.

# కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య చీకటి ఒప్పందం

## - రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు

మన ప్రజాగళం, న్యూఢిల్లీ

కేరళ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ , కమ్యూనిస్టు పార్టీలు లోపాయికారీగా కలిసిపోయాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. బుధవారం ఎర్నాకులం జిల్లాలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. కేరళలోని రెండు ప్రధాన కూటములు అవినీతి ఆరోపణలతో ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయాయని, ముఖ్యమంత్రి తన కుటుంబంతో సహా సిబిఐ కేసులు ఎదుర్కోవడం ఆ రాష్ట్రానికి గర్వకారణం కాదని పేర్కొన్నారు.ఈ సభలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. కేరళ ఎన్నికల్లో ఎర్నాకులం ఇంచార్జ్ గా ఆయన వ్యవహరిస్తున్నారు. రాజ్‌నాథ్ సింగ్ గారితో వేదిక పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేరళ ప్రజలలో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే వారు జాతీయవాదం వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని విస్మరించి కేవలం విమర్శలకే పరిమితమైందని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో ఆ పార్టీ ఘోరంగా విఫలమైందని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు.కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ–ఎన్డీయే కూటమి మాత్రమే కేరళకు సరైన ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. అవినీతిరహిత పాలన, పారదర్శకత మరియు సుశాసనం కోసం కేరళ ప్రజలు ఇప్పుడు ఆశతో బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కేరళలో బీజేపీ అద్భుతమైన ఫలితాలను సాధిస్తుందని, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

# రెండు నెలలకు సరిపడా చమురు నిల్వలు!

(మొదటి పేజీ తరువాయి..)

పెట్రోల్ బంకుల్లో ఎక్కడా ఇంధన కొరత ఏర్పడినట్టు నివేదికలు అందలేదని, సరఫరా గొలుసు పటిష్టంగా ఉందని తెలిపారు.

భారీగా పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు

ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు గత కొద్ది కాలంగా తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. సుమారు రెండు నెలల క్రితం బ్రెంట్ క్రూడ్ ధర ఒక బ్యారెల్‌కు 70 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం అది వందల డాలర్ల మార్కును దాటిపోయింది. అంటే దాదాపు 40 శాతానికిపైగా ధర పెరిగినప్పటికీ, భారత ప్రభుత్వం దేశీయ వినియోగదారులపై ఆ భారాన్ని పడనీయలేదని చెప్పారు.

సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ధఅలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం సహజం. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో సామాన్యులకు ఊరటనిస్తూ ధరలను స్థిరంగా ఉంచుతున్నట్టు ప్రకటించింది.

దిగుమతులపైనే ఆధారపడి ఉన్న భారత్

భారత్ తన ఎల్పీజీ అవసరాల కోసం దాదాపు 60 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయంగా సౌదీ సీపీ బెంచ్‌మార్క్ ధరలు గత నెలతో పోలిస్తే 522 డాలర్ల నుంచి 780 డాల్లర్లకు పెరిగాయి. ఇది సుమారు 44 శాతం పెరుగుదల అయినప్పటికీ దేశీయంగా వంట గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రభుత్వం పెంచలేదు. ధరలు పెంచకపోవడమే కాకుండా వినియోగదారులకు సేవలను అందించడంలో సాంకేతికతను జోడించి సేవలను మరింత పారదర్శకంగా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం 92 శాతం ఎల్పీజీ బుకింగ్ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 60 లక్షల సిలిండర్ల డెలివరీ పూర్తి అయిందంటే వ్యవస్థ ఎంత పకడ్బందీగా ఉందో తెలుస్తుందని వెల్లడించారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఎక్కడా స్టాక్ అయిపోయినట్టు ఫిర్యాదులు రాలేదని సుజాత శర్మ వివరించారు.

పీఎన్జీ, సీఎన్జీ నెట్‌వర్క్ విస్తరణకు చర్యలు

కేవలం పెట్రోల్ డీజిల్‌కే పరిమితం కాకుండా గృహ అవసరాలకు పైపుల ద్వారా సరఫరా చేసే గ్యాస్, రవాణా రంగంలో వాడే సీఎన్జీ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. దేశీయ వినియోగదారులకు, రవాణా రంగానికి వంద శాతం సరఫరాకు ఎలాంటి ఆటంకం రాకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

భయాందోళనలు వద్దని ప్రజలకు విజ్ఞప్తి

దేశంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రజలు భయపడొద్దని సుజాతా శర్మ ధైర్యం చెప్పారు. అనవసరంగా భయపడి అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని కూడా సూచించారు. రిఫైనరీలు గరిష్ట స్థాయిలో ఉత్పత్తిని సాగిస్తున్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండబోదని కూడా భరోసా ఇచ్చారు.

# 1.40 లక్షల మందికి రేషన్ కార్డు కట్..

(మొదటి పేజీ తరువాయి..)

పెరిగాయి. రేవంత్ ప్రభుత్వం వచ్చాక 15 లక్షలకుపైగా కొత్త కార్డులు పెరిగినట్లు కేంద్రం వెలల్డించింది. తెలంగాణలో 17,348 రేషన్ దుకాణాలు ఉండగా.. 1.05 కోట్ల మందికి సరుకుల పంపిణీ జరుగుతోంది. 99,36,073 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉండగా.. 5,66,660 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయి. ఇక అన్నపూర్ణ కార్డులు 5146 ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. జీహెచ్ఎంసీ చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లో ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 8.39 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇక రంగారెడ్డి జిల్లాలో 6.53 లక్షలు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో 6.41 లక్షలు ఉన్నాయి. అతి తక్కువగా ములుగు జిల్లాలో 1.02 లక్షల కార్డులు ఉన్నాయి. కాగా దేశవ్యాప్తంగా మూడు నెలలకు సంబంధించి రేషన్‌ను ఒకేసారి ఏప్రిల్‌లో పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా లబ్దిదారులందరికీ ఒకేసారి ఏప్రిల్, మే, జూన్ నెల కోటా అందించనుంది. ఎండల క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది.



# బోణీ కొట్టిన ఢిల్లీ!

## రాణించిన సమీర్, స్టబ్స్, ఎంగిడి, నటరాజన్.. బ్యాటింగ్ వైఫల్యంతో లక్నో బోల్తా!

మన ప్రజాగళం, న్యూఢిల్లీ

ముందుగా బౌలింగ్ లో సత్తా చాటిన ఢిల్లీ, ఆ తర్వాత కీలక సమయంలో బ్యాటింగ్ లో సత్తా చాటి ఐపీఎల్లో బోణీ కొట్టింది.

ఐపీఎల్ 2026లో ఢిల్లీ కేపిటల్స్ బోణీ కొట్టింది. బుధవారం లక్నోలోకి ఏకనా స్టేడియంలో ఆతిథ్య లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్ లో 6 వికెట్లతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన లక్నో.. బ్యాటింగ్ వైఫల్యంతో 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. మిడిలార్డర్ బ్యాటర్ అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో లుంగీ ఎంగిడి, నటరాజన్ మూడేసి వికెట్లతో సత్తా చాటారు. అనంతరం ఛేజింగ్ ను 17.1 ఓవర్లలోనే 4 వికెట్లకు 145 పరుగులు చేసి పూర్తి చేసింది. ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన సమీర్ రిజ్వి సూపర్బ్ ఫిఫ్టీ (47 బంతుల్లో 70 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్సర్) తో కలిసి కీలక సమయంలో సెంచరీ (119 రన్స్) కిపైగా పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ కు రెండు వికెట్లు దక్కాయి. ఇక గురువారం జరగబోయే మ్యాచ్ లో ఆతిథ్య కోల్ కతా నైట్ రైడర్స్ తో సన్ రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఆరంభంలోనే షాక్..ఇక స్వల్ప ఛేదనతో బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహల్ ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌటయ్యాడు. వెటరన్ పేసర్ మహ్మద్ షమీ వేసిన బంతిని గాల్లోకి ఆడగా, బౌండరీ వద్ద మోసిన్ క్యాచ్ పట్టగా పెవిలియన్ కు చేరాడు. ఆ తర్వాత నితీశ్ రాణా (15) మోసిన్ బోల్తా కొట్టించగా, పథుమ్ నిసాంక (1), అక్షర్ పటేల్ ను డకౌట్ గా ప్రిన్స్ యాదవ్ ఔట్ చేశాడు. దీంతో 26 పరుగులకే నాలుగు కీలకమైన వికెట్లు కోల్పోయి, ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది. సమీర్ ఇంపాక్ట్..ఈ దశలో మ్యాచ్ సమరీతిలో మొగ్గు చూపిన దశలో సమీర్ రిజ్వీ తన విలువను చాటుకున్నాడు. స్టబ్స్ తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆరంభంలో బంతి స్వింగ్ అవుతుండటంతో కాస్త ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ, క్రీజులో కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించారు. ముఖ్యంగా నాలుగు భారీ సిక్సర్లతో రిజ్వీ సత్తా చాటాడు. ఇదే జోరులో తను 37 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్ గా ఐదో వికెట్ కు 119 పరుగులు జోడించి, జట్టును వీరిద్దరూ కలిసి విజయతీరాలకు చేర్చారు. అలాగే 20 ఎక్స్ట్రాలు ఇవ్వడంతోపాటు పేలవ ఫీల్డింగ్ తో లక్నో మూల్యం చెల్లించుకుంది. అలాగే బ్యాటింగ్ ఆర్డర్ లో లక్నో చేసిన ప్రయోగాలు బెడిసి కొట్టాయి. విపరీతంగా ప్రయోగాలు చేయడం, త్వరగా వికెట్లు కోల్పోవడంతో షాబాజ్ అహ్మద్ ను ఇంపాక్ట్ ప్లేయర్ గా తీసుకురావడంతో, స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ బెంచ్ కే పరిమితమయ్యాడు. దీంతో లక్నో నాణ్యమైన స్పిన్నర్ లేకుండా బరిలోకి దిగినట్లయ్యింది. దీంతో ఆ జట్టు మిడిల్ ఓవర్లలో పట్టు సాధించలేక పోయింది.

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం



# పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్

# సంచలన ఆరోపణలు

## హరీష్ రావు, గూడెం మహిపాల్ రెడ్డి పై భూకబ్జా, స్కామ్ ఆరోపణలు!

(మన ప్రజాగళం – సంగారెడ్డి ):

అసెంబ్లీలో హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు తీవ్రంగా స్పందించిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, హరీష్ రావు గూడెం మహిపాల్ రెడ్డి పై తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవిత్రమైన దేవాలయం లాంటి అసెంబ్లీలో దొంగల గురించి మాట్లాడవద్దని" అంటూ ఆయన స్పీచ్ ప్రారంభించారు.

కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రధాన ఆరోపణలు:

తన రాజకీయ చరిత్ర తన కుటుంబం ఆస్తులు అమ్మి పేదలకు సాయం చేసిన చరిత్ర అని, హరీష్ రావు తన మామ కేసీఆర్‌ను అడగమని సవాల్ విసిరారు.మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా అగాహన లేదని, పూటకో మాట మాట్లాడి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.కోచింగ్ తీసుకోవాల్సింది తాను కాదు, హరీష్ రావు తీసుకోవాలని ఎద్దేవా చేశారు.1993 లే-ఔట్‌లో 62 సర్వే నంబర్ 5 ఎకరాలు శంకర్ లాల్ భూమికి చెందినవి. 63, 64 సర్వే నంబర్లుగా ఎందుకు మార్చారో ప్రశ్నించారు. పాత లే-ఔట్ 158 ప్లాట్‌ను కొత్త లే-ఔట్‌లో 63,64 సర్వే నంబర్‌గా మార్చి అమ్మేశారని ఆరోపించారు.ఇంద్రేశం 453 ఎక్సైజ్ భూమిని కబ్జా చేశారని, కంజర్లలో ఒక లక్ష గజాలు కబ్జా చేశారని, అమీన్‌పూర్ 200 అడుగుల రోడ్డులో 20 వేల గజాల గూడెం మధుసూదన్ రెడ్డి కబ్జా చేశారని ఆరోపణలు.వందల కోట్లు సంపాదించుకుని ఎలాపడితే అలా మాట్లాడుతున్నారని, అది నడవదని వ్యాఖ్యానించారు.తన సర్పంచ్ పదవి తొలగించడానికి హరీష్ రావు ఒత్తిడి చేశారని, "నువ్వు ఎమ్మెల్యేగా పోటీ వస్తానని, బీఆర్ఎస్‌కి రావాలని" బెదిరించారని ఆరోపించారు.తన అనుచరుల్లో 2001 తెలంగాణ ఉద్యమం నుంచి ఎవరైనా ఉన్నారా అని సవాల్ చేశారు. "నిజమైన ఉద్యమకారుల కోసం పని చేయమని" అడిగారు.మార్కెట్ కమిటీలో 308 లైసెన్సులు ఇచ్చి 20-25 కోట్ల స్కాం చేశారని ఆరోపించారు. లైసెన్సులు తీసుకుని అమ్ముకున్న వారిని వదలకూడదని, వార్తలుగా పంపాలని కోరారు."నువ్వు మనిషి అయితే రేపు తడి బట్టలతో శివాలయంలోకి రా, నేను వస్తా" అంటూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి సవాల్ చేశారు.కాటా శ్రీనివాస్ గౌడ్ పదవుల కోసం అమ్ముడు పోయే వ్యక్తి కాదు, ప్రజల కోసం పని చేసేవాడని తనను తాను సమర్థించుకున్నారు. కాటా దర్శన్ గౌడ్ కుటుంబం గురించి తెలుసని చెప్పారు.

కాంగ్రెస్ 10 రోజుల ముందు టికెట్ ఇచ్చి ఉంటే హరీష్ రావు ఇప్పుడు ఎమ్మెల్యే కాదని వ్యాఖ్యానించారు.గత రెండు సంవత్సరాలుగా హరీష్ రావు అవినీతి, అరాచకాలు బయటపెట్టడమే తన పని అని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అడిగినా హరీష్ చరిత్ర చెబుతారని వ్యాఖ్యానించారు."దొంగ ఉద్యమకారుల కోసం కొట్లాడి నిన్ను నువ్వు తక్కువ చేసుకుంటున్నావు. నిజమైన ఉద్యమకారుల కోసం పని చేయమని అడుగుతున్నానని అన్నారు.ఈ స్పీచ్ పటాన్‌చెరు రాజకీయాల్లో తాజా ఉద్రిక్తతను మరింత పెంచింది. హరీష్ రావు వైపు నుంచి ఇంకా స్పందన రాలేదు. ఈ ఆరోపణలు రాజకీయ ప్రచారంగా చూడాలా లేక వాస్తవాలు ఉన్నాయా అనేది విచారణ అవసరం అని కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.



# చండీగఢ్ బీజేపీ కార్యాలయం ముందు భారీ పేలుడు



### - విద్రోహ చర్యేనా?

మన ప్రజాగళం, న్యూఢిల్లీ

పంజాబ్ బీజేపీ కార్యాలయం వెలుపల పేలుడు సంభవించింది. విద్రోహచర్య ఉందా.. బ్యాటరీ పేలిందా అన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చండీగఢ్‌లోని సెక్టార్-37లో ఉన్న పంజాబ్ బీజేపీ కార్యాలయం వెలుపల బుధవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటన తీవ్ర కలకలం రేపింది. సాయంత్రం 5 గంటల సమయంలో కార్యాలయానికి ఆనుకుని ఉన్న బ్లడ్ బ్యాంక్ భవనం వద్ద నిలిపి ఉంచిన ఒక యాక్టివా స్కూటీలో ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి స్కూటీ హెడ్‌లైట్ కింది భాగం తునాతునకలవ్వడమే కాకుండా, అందులోని కొన్ని పదునైన వస్తువులు ఎదురుగా ఉన్న గోడకు బలంగా తగిలాయి. ఈ శబ్దం చాలా దూరం వరకు వినిపించడంతో స్థానికులు,పార్టీ కార్యకర్తలు భయాందోళనలకు గురయ్యారు.ఘటన జరిగిన వెంటనే చండీగఢ్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ కన్వర్దీప్ కౌర్ నేతృత్వంలో భారీ పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా బీజేపీ కార్యాలయ పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని దిగ్బంధించారు. ఘటనా స్థలానికి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందాన్ని కూడా పిలిపించారు. ప్రాథమికంగా ఇది తక్కువ తీవ్రత కలిగిన పేలుడు అని పోలీసులు భావిస్తున్నారు. అయితే, ఇది స్కూటీ బ్యాటరీ పేలుడా లేక ఏదైనా కుట్ర కోణం ఉందా అన్నది నిర్ధారించాల్సి ఉంది.

పంజాబ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అశ్విని శర్మ ఈ ఘటనపై స్పందించారు. పేలుడు జరిగిన సమయంలో తీసిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. బాంబు స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ సాయంతో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఏదైనా రసాయన పదార్థం వల్ల ఈ పేలుడు జరిగిందా లేదా అనేది తెలుసుకోవడానికి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు, కానీ పార్టీ కార్యాలయం వద్ద భద్రతను ఒక్కసారిగా పెంచారు.

బీజేపీ కార్యాలయం వద్ద ఇలాంటి ఘటన జరగడంతో భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. కేవలం స్కూటీ యజమానిని గుర్తించడమే కాకుండా, గత కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పంజాబ్ , చండీగఢ్ మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ పేలుడు వెనుక ఏదైనా విద్రోహ చర్య ఉందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది. త్వరలోనే ఈ ఘటనపై అధికారిక ప్రకటన విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.

# గూడెప్పాడ్ నుండి ఆత్మకూర్ వరకు హనుమాన్ జయంతోత్సవ భారీ బైక్ ర్యాలీ

(మన ప్రజాగళం – ఆత్మకూరు):



గూడెప్పాడ్ గ్రామ ప్రజలు మరియు హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ జయంతోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన భారీ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించనున్నారు.ఈ బైక్ ర్యాలీ ఏప్రిల్ 2 2026 గురువారం సాయంత్రం 4 గంటలకు గూడెప్పాడ్ శ్రీ హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమై ఆత్మకూర్ లోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వరకు అత్యంత వైభవంగా కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో ఆత్మీయ హిందూ బంధువులు హనుమాన్ మాలధారులు మరియు యువకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు

# గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ విక్రయాలు..

### చిన్నారుల ఆరోగ్యంతో యధేచ్ఛగా చెలగాటం

(మన ప్రజాగళం – ఆత్మకూరు):

ఆత్మకూరు మండల పరిధిలోని గూడెప్పాడ్ గ్రామంలోని పలు దుకాణాల్లో వినియోగదారుల ప్రాణాలతో యధేచ్ఛగా చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గడువు ముగిసిన (జు×జూఅతీవ అయిన) సాఫ్ట్ డ్రింక్స్‌ను అమాయక ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. పాత స్టాక్‌ను వదిలించుకునే క్రమంలో దుకాణదారులు ఎక్స్‌పైరీ డేట్‌ను గమనించకుండా అమ్మకాలు సాగిస్తుండటంతో స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. విషయం తెలియని చిన్నపిల్లలు ఈ శీతల పానీయాలను తాగి అనారోగ్య పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. గడువు ముగిసిన పానీయాలు సేవించడం వల్ల వాంతులు, విరేచనాలు మరియు తీవ్రమైన ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు మండల అధికారులు స్పందించి గూడెప్పాడ్ గ్రామంలోని దుకాణాలను తనిఖీ చేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మృతురాలి కుటుంబానికి చల్లా పరామర్శ



(మన ప్రజాగళం – గీసుగొండ):

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడి తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఊట్ల బాపిరెడ్డి తల్లి రాధమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందగా ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా రాధమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోలీసు ధర్మారావు బీఆర్ఎస్ నాయకులు బోడకుంట్ల ప్రకాష్ చల్లా వేణుగోపాల్ రెడ్డి గుర్రం రఘు గోలి రాజయ్య సుంకరి శివ తదితరులు పాల్గొన్నారు.


# యుద్ధాన్ని ముగించనున్న ట్రంప్.. 2,000 పాయింట్ల సెన్సెక్స్ జంప్, నిఫ్టీ సైతం జోరు

### - ఇన్వెస్టర్లు బీ అలర్ట్

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగడంతో స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. బుధవారం నాడు సెన్సెక్స్ 2,000 పాయింట్లు పెరిగింది. అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరించారు.

భారత స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులను అధిగమించి బుధవారం బాగా పుంజుకుంది, ప్రపంచ పరిణామాలపై కొత్త ఆశలతో దలాల్ స్ట్రీట్‌లో బెంచ్ మార్క్ సూచీలు లాభాలను నమోదు చేశాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే అవకాశం కనిపించడంతో పెట్టుబడిదారులను మళ్లీ మార్కెట్‌లో ఆసక్తి చూపడంతో భారీ ర్యాలీ వచ్చింది. అయితే, ఈ ఇరాన్, అమెరికా యుద్ధ మేఘాలు నిజంగానే తొలగిపోతాయా అనే అనుమానాలు సైతం కొనసాగుతున్నాయి.

భారత ఈక్విటీలు కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న రెండు రోజుల నష్టాల నుండి కోలుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 2,000 పాయింట్లకు పైగా పెరిగింది. దాంతో పాటు నిఫ్టీ ప్రారంభ ట్రేడింగ్‌లో 2.7% కంటే ఎక్కువ పుంజుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలో తగ్గుతాయని ఇరువైపుల నుంచి సంకేతాలు రావడంతో భారత స్టాక్ మార్కెట్లో మళ్లీ లాభాల బాట పడుతోంది. బుధవారం మార్కెట్లో బీఎస్ఈకి చెందిన సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు చెందిన నిఫ్టీ 50 రికవరీ అవుతున్నాయి.ఇరాన్‌పై సైనిక చర్య రెండు మూడు వారాల్లో ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిగ్నల్ ఇవ్వడంతో ఇన్వెస్టర్లలో ఆశలు చిగురిస్తున్నాయి. ఉద్రిక్తత త్వరలో తొలగిపోతుందని, పెట్టుబడులకు ఏ ఇబ్బంది లేదని నమ్మకం రావడంతో ఇన్వెస్టర్లు కం బ్యాక్ చేయడం ప్రపంచ స్టాక్ మార్కెట్లలో కనిపిస్తోంది. మరోవైపు బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు వి105కి పడిపోయింది. ఓవరాల్‌గా ఆసియా ఈక్విటీలు ర్యాలీ అవుతున్నాయి.



ఈ ర్యాలీకి ప్రధాన కారణం ఏంటీ..

స్టాక్ మార్కెట్లో నేటి ర్యాలీకి మరో ప్రధాన కారణం ఇటీవల కరెక్షన్ తర్వాత పెట్టుబడిదారులు మళ్లీ ఈక్విటీలతో ఇతరత్రా విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇటీవల భారీగా పడిపోయిన రంగాలలో ఇన్వెస్ట్ చేయడం సూచీలు పైపైకి వెళ్తున్నాయి. కేవలం కొన్ని విభాగాల్లో క్షీణత కనిపించగా, వేలాది స్టాక్‌లు నష్టాల నుంచి బౌన్స్ బ్యాక్ అవుతున్నాయి. మిడ్-క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్‌లు 3% కంటే ఎక్కువ లాభాలతో బెంచ్‌మార్క్‌లను దాటడం విశేషం. పెద్ద స్టాక్‌లతో పాటు చిన్న స్టాక్స్ సైతం మంచి ధరలకు ర్యాలీ అవుతుండటం వారిలో యుద్ధ భయాన్ని పోగొట్టిందని సూచిస్తున్నాయి.

తగ్గుతున్న అస్థిరత, కానీ జాగ్రత్త అవసరం

మార్కెట్ అస్థిరతకు సంబంధించిన కీలకంగా భావించే ఇండియా ఎ×శ ఇండియా సూచీ 10% తగ్గి దాదాపు 25కి చేరుకుంది. తక్కువ అస్థిరత స్వల్పకాలంలో పెట్టుబడిదారుల విశ్వాసంతో పాటు పెట్టుబడుల్లో స్థిరత్వాన్ని పెంచుతుంది. ప్రస్తుతం ఎంత పుంజుకున్నా ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

పెట్టుబడిదారులు ప్రస్తుం ఏం చూడాలి

ప్రస్తుత ర్యాలీ ఊరట కలిగిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి రికవరీ ఫేజ్ అనుకోవడం తొందరపాటు కావచ్చు. పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా సర్దుబాటు కాలేదని గుర్తుంచుకుని ఇన్వెస్ట్ చేయాలి. మరికొన్ని రోజులు ఆచితూచి వ్యవహరించాలని చెబుతున్నారు. ఉద్రిక్తత తగ్గితేనే ముడి చమురు ధరలు స్థిరంగా ఉంటాయి, ఇంకా పడిపోతాయి. పలు రంగాలపై ఒత్తిడి తగ్గి మార్కెట్‌కు మళ్లీ బూమ్ వస్తుంది. .

దీర్ఘకాలిక పెట్టుబడిదారులు స్ట్రాంగ్ స్టాక్‌లలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. బ్యాంకింగ్ వంటి రంగాలలో భారీగా కరెక్షన్ కనిపిస్తోంది. అవకాశం వచ్చినట్లు కనిపించినా, ఫైనాన్షియల్ డిసిప్లిన్ మరికొన్ని రోజులు ఉండాలని సూచిస్తున్నారు.

# రాజకీయ క్షేత్రంలో విజయ్ సరికొత్త ప్రయోగం!




**మన ప్రజాగళం న్యూస్ :** వెండితెరపై తన నటనతో కోట్లాది మందిని అలరించిన 'స్టార్ హీరో' విజయ్, ఇప్పుడు రాజకీయ యవనికపై అత్యంత సాహసోపేతమైన అడుగు వేశారు. తన రాజకీయ అరంగేట్రంలోనే 'డ్యూయల్ రోల్' పోషిస్తూ.. అటు చెన్నైలోని పెరంబూర్, ఇటు ఆధ్యాత్మిక కేంద్రం తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఒకేసారి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాల తర్వాత తమిళనాడులో ఒక అగ్రనేత రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతుండటంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. 1991లో జయలలిత సృష్టించిన ప్రభంజనాన్ని తలపిస్తూ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేతగా విజయ్ చేస్తున్న ఈ ప్రయోగం.. అటు అధికార డీఎంకే, ఇటు ప్రతిపక్ష అన్నా డీఎంకే వర్గాల్లో కొత్త ఆందోళనను, చర్చను రేకెత్తిస్తోంది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌లో ఈ 'దళపతి' వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందోనని యావత్ భారత్ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.స్టార్ హీరో విజయ్ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఒకేసారి రెండు నియోజకవర్గాలైన పెరంబూర్ , తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు 35 ఏళ్ల తర్వాత ఒక ప్రముఖ నేత ఇలా రెండు స్థానాల నుంచి బరిలోకి దిగడం విశేషంగా చర్చనీయాంశమవుతోంది.ఈ వ్యూహం కొత్తది కాకపోయినా తమిళనాడులో మాత్రం అరుదుగా కనిపించే రాజకీయ ప్రయోగం. 1991లో అన్నా డీఎంకే అధినేత్రి జయలలిత బర్గూర్, కంగేయం నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండు చోట్లా గెలిచి తన రాజకీయ ప్రభావాన్ని చాటుకున్నారు. ఆ తర్వాత పెద్ద స్థాయిలో ఇలాంటి సాహసం చేసిన నాయకులు చాలా అరుదు. దేశ రాజకీయాల్లో మాత్రం ఈ ట్రెండ్ చాలా కాలం నుంచే ఉంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 1957లోనే రెండు లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేశారు. తరువాత సోనియా గాంధీ, నరేంద్ర మోదీ వంటి నేతలు కూడా రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయాలు సాధించారు. అయితే 1996లో అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థి రెండు స్థానాలకు మించి పోటీ చేయకూడదనే పరిమితి విధించబడింది.

విజయ్ ఎంపిక చేసిన పెరంబూర్ నియోజకవర్గం ప్రస్తుతం రాజకీయంగా అత్యంత కీలకంగా మారింది. ఇక్కడ డీఎంకే అభ్యర్థి ఆర్.డి. శేఖర్‌తో ఆయన నేరుగా పోటీ పడుతున్నారు. ఈ ప్రాంతంలో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి సుమారు 40 వేల మంది సభ్యులు ఉండటం ఆయనకు బలంగా భావిస్తున్నారు. ఒకప్పుడు రిజర్వ్‌గా ఉన్న ఈ నియోజకవర్గం 2008 తర్వాత జనరల్ కేటగిరీగా మారింది. గతంలో డీఎంకే, అన్నా డీఎంకే మధ్యే ప్రధాన పోటీ ఉండేది. అయితే ఇప్పుడు విజయ్ ఎంట్రీతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.మరోవైపు తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో కూడా పోటీ ఉత్కంఠభరితంగా మారింది. ఇక్కడ డీఎంకే నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ఇనిగో ఇరుదయ రాజ్ మళ్లీ బరిలో ఉన్నారు. గతంలో ఈ ప్రాంతంలో అన్నా డీఎంకే ఎక్కువసార్లు గెలిచిన చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో విజయ్ తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకోవడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఈసారి మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమైంది. సెంగోట్టైయన్, ఆధవ్ అర్జున వంటి కీలక నేతలు కూడా బరిలో ఉండటం పార్టీకి బలం చేకూర్చుతోంది. ప్రజల్లో మార్పు కోరిక ఎంతవరకు ఉందన్నదే ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుంది.గతంలో జయలలిత 2001లో నాలుగు చోట్ల నామినేషన్లు వేసినా అవి తిరస్కరణకు గురయ్యాయి. అయినప్పటికీ ఆమె తన పార్టీని విజయానికి నడిపించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అదే తరహాలో విజయ్ కూడా తన సినీ ఇమేజ్‌ను రాజకీయ ఓట్లుగా మార్చుకుని అసెంబ్లీలో అడుగుపెడతారా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పనుంది.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**మన ప్రజాగళం న్యూస్ :** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. బుధవారం ఈ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టగా, వైసీపీ మినహా దేశంలోని ఉన్న 40 పార్టీలు ఆమోదం తెలిపాయి. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సభలో ఉదయం 12 గంటల సమయంలో బిల్లును ప్రవేశపెట్టారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చర్చను ప్రారంభించారు. ఈ చర్చలో మొత్తం 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు మాట్లాడారు.ఏపీ పునర్విభజన చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ, రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును మెజార్టీ పార్టీలు ఆమోదించాయి. అధికార కూటమిలోని బీజేపీ, శివసేన, టీడీపీ, జనతాదళ్ పార్టీలతోపాటు విపక్షంలోని కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీలు కూడా బిల్లును సమర్థిస్తున్నట్లు ప్రకటించాయి. అయితే విపక్షానికి చెందిన కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు చర్చలో పాల్గొని విభజన హామీలు నెరవేర్చాలని కోరారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మినహా సభలో బిల్లుపై మాట్లాడిన ఎంపీలు అందరూ సమర్థిస్తున్నట్లు ప్రకటించారు. కానీ, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాత్రం అమరావతికి మాత్రం తాము వ్యతిరేకం కాదని చెబుతూనే బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.అమరావతి బిల్లుకు లోక్ సభ ఆమోదం లభించడంతో గురువారం రాజ్యసభలో ముందుకు రానుంది. అమరావతి విషయంలో దాదాపు అన్ని పార్టీలు సముఖంగా ఉండటంతో రాజ్యసభలో కూడా బిల్లు ఆమోదం పొందడం ఖాయమంటున్నారు. కాగా, బిల్లుపై దాదాపు 18 మంది ఎంపీలు మాట్లాడగా, మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు తెలుగు రాష్ట్రానికి చెందిన ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, బాలశౌరి మాతృభాష తెలుగులోనే మాట్లాడారు.ముందుగా మాట్లాడిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అమరావతి రాజధానికి చారిత్రక నేపథ్యం ఉందని, సంస్కృతిక వైభవంతో విరాజిల్లిందని గుర్తు చేశారు. 60 రోజుల్లో 29 వేల మంది రైతుల నుంచి భూ సమీకరణ చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మి రైతులు తమ జీవనాధారం వదులుకుని భూములు ఇచ్చారని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్ అమరావతికి మద్దతు ఇచ్చారని, సీఎం అయ్యాక మూడు రాజధానులు అంటూ మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని రైతులను హేళన చేశారని, వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రి పెమ్మసాని ప్రారంభించిన చర్చను బీజేపీ ఎంపీ సీఎం రమేశ్



కొనసాగించారు. రాజధాని అమరావతి చట్టబద్ధతకు తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆ తర్వాత వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ, రాజధాని అమరావతి బిల్లుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అమరావతిని తాము వ్యతిరేకించడం లేదని, కానీ రైతులకు న్యాయం చేయని బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక మిథున్ రెడ్డి తర్వాత మాట్లాడిన కాంగ్రెస్, సమాజ్ వాది, శివసేన ఎంపీలు కూడా బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. లోక్ సభలో ఒక్క వైసీపీ తప్పా, మిగిలిన అన్ని పార్టీలు బిల్లుకు అనుకూలంగా ఉండటంతో ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఈ చర్చ తీవ్ర ఉత్కంఠ రేపింది.

# కాంగ్రెస్ లో గొంతు లేస్తోంది



**మన ప్రజాగళం న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అసమ్మతులు అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు.

బడ్జెట్ సెషన్ లోనే : ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయని అంటున్నారు.

రాములమ్మ ఆవేశం : ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు.

జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు. ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు. ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్ లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు.

# యుద్ధం ముగిస్తానంటున్న ట్రంప్..

## - అమెరికన్ కంపెనీలను టార్గెట్ చేసిన ఇరాన్?



**మన ప్రజాగళం న్యూస్ :** పశ్చిమాసియాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్థిరత ఇప్పుడు ఒక చారిత్రాత్మక మలుపు వద్ద నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ వేదికగా చేసిన సంచలన ప్రకటన ప్రపంచ రాజకీయ చిత్రపటాన్ని ఒక్కసారిగా మార్చేసింది. ఇరాన్‌పై సాగుతున్న సైనిక చర్యను మరో రెండు నుంచి మూడు వారాల్లో ముగిస్తామని ఆయన ప్రకటించడం.. యుద్ధ మేఘాల మధ్య ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తున్నప్పటికీ తెరవెనుక పొంచి ఉన్న ముప్పులు అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతున్నాయి.

యుద్ధం ముగింపు దశకు.. ట్రంప్ వ్యూహాత్మక ప్రకటన

వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్ అత్యంత స్పష్టతతో తన నిర్ణయాన్ని ప్రకటించారు. "మేము ఇరాన్ నుంచి త్వరలోనే వైదొలుగుతాం. ఇది కేవలం ఒక ఒప్పందంపై ఆధారపడి తీసుకున్న నిర్ణయం కాదు. ఇరాన్ యొక్క అణు సామర్థ్యం, సైనిక శక్తి కోలుకోలేనంతగా దెబ్బతిన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఈ అడుగు వేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా చేపట్టిన వైమానిక దాడులు ఇరాన్ రక్షణ వ్యవస్థను కుప్పకూల్చాయని.. ఆ దేశం తిరిగి పూర్వస్థితికి రావడానికి కనీసం 15 నుంచి 20 ఏళ్లు పట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం ఈ పరిణామాలను ధృవీకరించారు. యుద్ధం దాని తుది అంకానికి చేరుకుందని అతి త్వరలోనే జాతిని ఉద్దేశించి ట్రంప్ చేయనున్న ప్రసంగంలో మరిన్ని కీలకమైన భౌగోళిక-రాజకీయ నిర్ణయాలు వెలువడతాయని ఆయన సంకేతాలిచ్చారు.

కార్పొరేట్ దిగ్గజాలకు ఇరాన్ హెచ్చరిక: 'సైబర్' ముప్పు పొంచి ఉందా?

ట్రంప్ ప్రకటనతో యుద్ధం ముగుస్తుందని ఆశిస్తున్న తరుణంలో ఇరాన్ నుంచి వెలువడిన హెచ్చరికలు అగ్నికి ఆజ్యం పోశాయి. ఇరాన్ కేవలం సైనిక దాడులకు పరిమితం కాకుండా అమెరికా ఆర్థిక మూలాలను దెబ్బతీసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన టెక్, ఫైనాన్స్ దిగ్గజాలపై దాడులు చేస్తామని ఇరాన్ బహిరంగంగా హెచ్చరించింది.ఈ జాబితాలో ఉన్న సంస్థలు చూస్తే ఇరాన్ ఎంతటి తీవ్రమైన ప్రతీకారానికి సిద్ధమవుతుందో అర్థమవుతుంది. టెక్ దిగ్గజాలైన ఆపిల్, మైక్రోసాఫ్ట్ , గూగుల్, మెటా, ఎన్వీడియా తోపాటు హార్డ్‌వేర్ ఢ సాఫ్ట్‌వేర్ సంస్థలు సిస్కో, ఇంటెల్, ఒరాకిల్, ఐబీఎం, డెల్. అలాగే.. ఆర్థిక , పారిశ్రామిక దిగ్గజాలైన జేపీ మోర్గాన్ చేజ్, టెస్లా, జనరల్ ఎలక్ట్రిక్ సంస్థలను ఇరాన్ టార్గెట్ చేసింది.. ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 8 గంటల (టెహ్రాన్ సమయం) లోపు ఈ హెచ్చరికలు అమలులోకి వస్తాయని డెడ్‌లైన్ విధించడం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ, ఫైనాన్స్ రంగాలను వణికించేలా చేస్తోంది. ఇది సాంప్రదాయ యుద్ధం నుంచి అత్యాధునిక సైబర్ లేదా వ్యూహాత్మక ఆర్థిక యుద్ధంగా మారే ప్రమాదాన్ని సూచిస్తోంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఈ పరిణామాలు మార్కెట్లపై మిశ్రమ ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకవైపు అమెరికా గ్యాస్ ధరలు తగ్గుతాయని ట్రంప్ భరోసా ఇస్తుండగా మరోవైపు ఇరాన్ లక్ష్యంగా చేసుకున్న కార్పొరేట్ సంస్థల షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. ఇరాన్ గనుక ఈ దిగ్గజ సంస్థల డేటా సెంటర్లు లేదా ఫైనాన్షియల్ నెట్‌వర్క్‌లపై దాడి చేస్తే అది ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసు.. డిజిటల్ వ్యవస్థను కుప్పకూల్చే అవకాశం ఉంది.యుద్ధం రణక్షేత్రం నుంచి వైదొలగడం ఒక ఎత్తైతే, అది డిజిటల్ , ఆర్థిక రంగానికి వ్యాపించడం మరో ఎత్తు. ఇరాన్ హెచ్చరించినట్లుగా కార్పొరేట్ యుద్ధం మొదలైతే దాని తీవ్రత సరిహద్దులకు అతీతంగా ఉంటుంది.మొత్తానికి పశ్చిమాసియాలో తుపాకీ గొట్టాలు నిశ్శబ్దమవుతున్న వేళ సరికొత్త తరహా ఘర్షణలకు అంకురార్పణ జరుగుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రానున్న రెండు వారాలు ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో అత్యంత కీలకం కానున్నాయి.


# పెరిగిన మీ సేవా చార్జీలు

మీ సేవ
సులభంగా, వేగంగా

**మన ప్రజాగళం న్యూస్ :** ప్రజలకు ,ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పలు సేవలు అందిస్తున్న మీ సేవా కేంద్రాల్లో పలు సర్వీసు చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెరిగిన చార్జీలు బుధవారం నుంచే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టంగా పెర్కొంది. వినియోదారులకు అందిస్తున్న సర్వీసులను రెండు రకాలుగా విభజిస్తూ ఏ ( రీ ఇస్యూ ఆఫ్ సర్టిఫికేట్స్,ఈసీ ( ఇన్‌కంబర్‌రెన్స్ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికేట్)కేటగిరిలోని సర్వీసులకు రూ.62 రూపాయలను, అదే విధంగా బి కేటగిరి సర్వీసు( ఇన్‌కమ్ సర్టిఫికెట్, కమ్యూనిటీ సర్టిఫికేట్, రెసెడెన్స్ సర్టిఫికెట్, అప్లికేషన్ ఫర్ న్యూ ఫుడ్ సెక్యూర్టీ కార్డు, కరక్షన్ ఆఫ్ ఫుడ్ సెక్యూర్టీ కార్డు,ఓబీసి సర్టిఫికేట్, లేట్ బర్త్,డెత్ సర్టిఫికెట్, ఎలక్ట్రిసిటీ న్యూ కనెక్షన్ సర్టిఫికేట్, ఫ్యామీలీ మెంబర్‌షిప్ సర్టిఫికేట్,ఈడబ్లూస్ సర్టిఫికేట్, ఈ డబ్లూస్ సర్టిఫికేట్,భూ భారతి కేవైసీ,ఈబీసీ సర్టిఫికెట్) కు రూ 80 వసూలు చేయాలని పేర్కొంది. కొన్ని విద్యుత్‌శాఖ, రవాణాశాఖలు తమ సేవలను వినియోగాదారులకు అందించేందుకు ప్రత్యేకంగా యాప్‌లను, ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చుకొగా ఇతర శాఖలకు సంబంధించిన సేవలను ఈ సేవా కేంద్రాలు అందిస్తున్నాయి. ముఖ్యంగా జిహెచ్‌ఎంసిలో పరిధిలోకి వచ్చే బర్త్, డెత్ సర్టిఫికెట్‌ల జారీ సేవలను అనేక మంది వినియోగదారులు వినియోగించుకుంటున్నారు.నగరంలో ఉన్న 56 కేంద్రాలు ప్రజలకు సుమారు 100కు పైగా సేవలను అందిస్తున్నాయి.వినియోగదారులు అవగాహన కోసం సర్వీసు చార్జీల పెంపునకు సంబంధించి ఈ సేవా కేంద్రాల్లో బ్యానర్లను కూడా ఏర్పాటు చేస్తామని వారు చెబుతున్నారు.

# హెల్త్

## స్పెర్మ్ క్వాలిటీ పై ఆసక్తికర రిపోర్ట్



– వేసవి అపోహలకే చెక్!

**మన ప్రజాగళం న్యూస్ :** ఈ రిపోర్ట్ ముఖ్యంగా గర్భధారణ కోసం ప్రయత్నిస్తున్న జంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా చాలామంది 'ఏ కాలంలో ప్రయత్నిస్తే మంచిది?' అనే సందేహంతో ఉంటారు. పురుషుల ఫెర్టిలిటీపై మాట్లాడినప్పుడు, ఒక అభిప్రాయం వినిపిస్తుంది. ఎక్కువ వేడి, ముఖ్యంగా వేసవి ఉష్ణోగ్రతలు (వేసవి కాలం) స్పెర్మ్ క్వాలిటీని దెబ్బతీస్తాయని. అందుకే చాలా మంది జంటలు గర్భధారణ ప్రయత్నాలను కాలానుగుణంగా ప్లాన్ చేస్తుంటారు. తాజాగా వచ్చిన ఒక పెద్ద అధ్యయనం ఈ నమ్మకాలను పూర్తిగా తలకిందులు చేసింది. వాస్తవానికి, వేసవిలోనే స్పెర్మ్ నాణ్యత మెరుగ్గా ఉంటుందని ఈ రిపోర్ట్ వెల్లడించింది.

**15వేల కంటే ఎక్కువ మందిపై పరీక్షలు..**

ఈ అధ్యయనంలో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 15,581 మంది పురుషుల వీర్య నమూనాలను విశ్లేషించారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాధారణంగా అనుకున్నట్లుగా వేసవిలో స్పెర్మ్ క్వాలిటీ తగ్గలేదని, అందుకు విరుద్ధంగా జూన్, జులై నెలల్లో నాణ్యత ఎక్కువగా ఉందని తేలింది. అదే సమయంలో డిసెంబర్, జనవరి వంటి చల్లని కాలంలో స్పెర్మ్ క్వాలిటీ తక్కువగా నమోదైంది.

**డీ విటమిన్ కారణమా?**

ఈ ఫలితాలపై పరిశోధకులు విశ్లేషించినప్పుడు మరి కొన్ని ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. వేసవిలో ఎక్కువ సూర్యకాంతి వల్ల శరీరంలో విటమిన్ 'డీ' స్థాయిలు పెరుగుతాయి. ఇది హార్మోన్ల సమతుల్యతకు సహాయపడుతుంది. అలాగే, వేడి కారణంగా రక్తప్రసరణ మెరుగుపడడం కూడా స్పెర్మ్ ఉత్పత్తిపై పాజిటివ్ ప్రభావం చూపవచ్చు. మరోవైపు శీతాకాలంలో శరీర కార్యకలాపాలు తగ్గడం, సూర్యకాంతి కొరత ఉండటం వల్ల హార్మోన్ల మార్పులు సంభవించి స్పెర్మ్ నాణ్యత తగ్గే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**గత అనుమానాలకు లైన్ క్లియర్..**

ఇది వరకూ ఉన్న 'వేసవి = స్పెర్మ్ డ్యామేజ్' అనే భావనకు ఈ అధ్యయనం సమాధానం ఇచ్చింది. అయితే, దీన్ని పూర్తిగా సాధారణ నియమంగా తీసుకోవడం కూడా సరైంది కాదు. ఎందుకంటే వ్యక్తిగత జీవనశైలి, ఆహారం, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి వంటి అంశాలు కూడా ఫెర్టిలిటీపై ప్రభావం చూపుతాయి. కేవలం కాలం మార్పుతోనే ఫలితాలు మారిపోవు.

**గర్భాదారణకు యత్నిస్తున్న జంటలకు గుడ్ న్యూస్..**

ఈ రిపోర్ట్ ముఖ్యంగా గర్భధారణ కోసం ప్రయత్నిస్తున్న జంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా చాలామంది 'ఏ కాలంలో ప్రయత్నిస్తే మంచిది?' అనే సందేహంతో ఉంటారు. ఇప్పుడు ఈ అధ్యయనం ప్రకారం వేసవి కాలం కూడా మంచి అవకాశాలను అందిస్తుందని చెప్పవచ్చు. అలాగే ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న వారికి కూడా ఇది ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. వైద్యులు చికిత్సా ప్రణాళికలు రూపొందించేటప్పుడు సీజనల్ ఫ్యాక్టర్లను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది.

**దీనితో పాటు వీటిని కూడా చూసుకోవాలి..**

అయితే ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి.. ఫెర్టిలిటీ అనేది ఒకే ఒక్క కారణంపై ఆధారపడే విషయం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి అంశాలు కూడా కీలకం. అధిక మద్యం, పొగతాగడం వంటి అలవాట్లు స్పెర్మ్ క్వాలిటీని దెబ్బతీస్తాయి. కాబట్టి జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా కూడా ఫెర్టిలిటీని మెరుగుపరచుకోవచ్చు. మొత్తానికి, ఈ తాజా అధ్యయనం ఒక విషయం స్పష్టంగా చెబుతోంది మనం అనుకున్నట్టుగా ప్రకృతి ఎప్పుడూ ఒకే విధంగా పనిచేయదు. కొన్ని సార్లు మన నమ్మకాలకే విరుద్ధంగా ఫలితాలు వస్తాయి. వేసవి కాలాన్ని ఫెర్టిలిటీకి ప్రతికూలంగా చూడకుండా, శాస్త్రీయ ఆధారాలతో పరిశీలిస్తే అది కూడా ఒక అవకాశంగా మారుతుంది. సరైన సమాచారం, సమతుల్య జీవనశైలి ఉంటే, ప్రతి కాలం కూడా కొత్త జీవానికి ఆహ్వానం పలికే సమయమే.

# సగటు ఆయుష్షు పెరిగింది...

– జపాన్‌దే అగ్ర తాంబూలం



**మన ప్రజాగళం న్యూస్ :** మనిషి జీవన ప్రమాణం పెరిగింది. ఆయుర్దాయం కూడా ఇంకా పెరిగింది. ఒకనాటి తో పోలిస్తే ఇపుడు మరింత జీవితం దక్కుతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి కానీ మనిషి సగటు ఆయుర్ధాయంలో గణనీయమైన ఈ పెరుగుదలలో భారత్ కి కూడా స్థానం ఉండడమే విశేషంగా చెప్పుకోవాలి. గత ఆరు దశాబ్దాల కాలాన్ని చూస్తే కనుక ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ సగటు మనిషి ఆయుష్షు పెరిగింది అని నివేదికలు చెబుతున్నాయి.

**జపాన్ గ్రేట్ :**

జపాన్ లో ఎక్కువ కాలం జీవించే వారు ఉంటారని అందరికీ తెలిసిందే. ఇపుడు ప్రపంచ గణాంకాలు చూసినా జపాన్ దే అగ్ర స్థానంగా ఉంది. చైనా కూడా అమెరికాతో సమానంగా ఆయుష్షుని పెంచుకుంది. భారత్ విషయమే తీసుకుంటే అరవై ఏళ్ళ క్రితం సగటు భారతీయుడు జీవిత కాలం కేవలం 46 ఏళ్ళు మాత్రమే. కానీ ఇప్పుడు అది ఏకంగా 72 కి చేరింది. దాంతో భారత్ లో కూడా మనిషి జీవిత కాలం బాగానే ఉన్నట్లు అయింది.

**ఆధునిక వైద్యంతో పాటు :**

గతంతో పోలిస్తే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. దాంతో పాటు జీవన ప్రమాణాలు కూడా బాగానే పెరిగాయి. వీటి వల్లనే ఆయుష్షు కూడా పెరిగింది అని నిపుణులు చెబుతున్నారు. మెరుగైన వైద్య సేవలు ఇపుడు లభ్యమవుతున్నాయి. అలగే పరిశుభ్రతతో కూడిన జీవితం గతానికి పోలిస్తే ఎక్కువగానే దక్కుతోంది. మరో వైపు చూస్తే ప్రపంచ సగటు ఆయుర్దాయం అరవై ఏళ్ళ క్రితం 51 ఏళ్ళు అయితే ఇపుడు అది కాస్తా 73.3గా ఉంది. కరోనా వంటి మహమ్మారి వచ్చి కొంత ఆయుష్షుని తగ్గించినా అది తాత్కాలికంగానే ఉంది. మళ్ళీ పూర్వం మాదిరిగానే మనిషి జీవిత కాలం పెరిగింది.

**గణాంకాలు చూస్తే కనుక :**

ఇక ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం గణాంకాల ప్రకారం చూస్తే కనుక అత్యధిక ఆయుర్దాయం కలిగిన దేశాల జాబితాలో జపాన్ అగ్రస్థానంలో ఉందిని చెప్పాలి. అక్కడ 1960లోనే అక్కడ సగటు ఆయుష్షు 68 ఏళ్లుగా ఉంది. ఇక అది ఇపుడు ఏకంగా 84 ఏళ్లకు పెరిగింది. అదే విధంగా ఇటలీ వంటి యూరోపియన్ దేశాలలో చూస్తే సగటు ఆయుర్దాయం 83.7 ఏళ్లుగా ఉంది. ఇక్కడ మంచి ఆరోగ్యకరమైన సమ్రక్షణ వ్యవస్థలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అలాగే అక్కడ ప్రజానీకం కూడా మంచి ఆహారం అలవాట్లను చేసుకున్నారని అంటున్నారుఇ.

**అమెరికా తీరు అలా :** ప్రపంచ సగటు ఆయుష్ను అనేక దేశాలలో భారీ పెరుగుదలను చూపించగా అమెరికాలో మాత్రం అది నెమ్మదిగానే ఉంది అని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికలో 1960లో సగటు వయసు 70 ఏళ్ళుగా ఉంది. అయితే ఇపుడు మరో ఎనిమిదేళ్ళు మాత్రమే పెరిగి అది 78.4 ఏళ్లకు చేరింది. ఆ దేశంలో ఉన్న ఆరోగ్య సమస్యలలో ఊబకాయం, ఆరోగ్య సంరక్షణ లో కొన్ని రకాలైన అసమానతలు వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఇక పొరుగున ఉన్న చైనా దేశం అయితే సగటు ఆయుష్షు విషయంలో గణనీయమైన పురోగతిని సాధించింది. 1960లో చైనాలో సగటి ఆయుష్షు అయితే చాలా తక్కువగా 33 ఏళ్లుగా ఉంది. ఇక ఇపుడు అక్కడ సగటు ఆయుర్దాయం ఏకంగా 78 ఏళ్లకు పెరిగి అమెరికాతో సరిసమానం అయింది. అంటే అక్కడ హెల్త్ పట్ల తీసుకునే జాగ్రత్తలు ఇతర ఆహార అలవాట్లు సర్కార్ తీసుకునే నిర్ణయాలు అన్నీ కలిసి ఈ విధంగా ఉన్నాయని అంటున్నారు.

# బిజినెస్

## హెచ్1బీ లాటరీ ముగింపు...




**- అమెరికా కల చెదిరిన వేళ!**

**మన ప్రజాగళం న్యూస్ :** అమెరికాలో కొలువు తీరాలని.. అక్కడి అత్యాధునిక జీవనశైలిని అందిపుచ్చుకోవాలని కలలుగనే లక్షలాది మంది విదేశీ ఐటీ నిపుణులకు హెచ్1బీ వీసా ఒక బంగారు బాట. ప్రతి ఏటా నిర్వహించే ఈ వీసా లాటరీ ప్రక్రియ ఈసారి కూడా ఉత్కంఠకు మరెంతో మంది నిరాశకు వేదికైంది. తాజాగా ఆర్థిక సంవత్సరం 2027 కు సంబంధించిన హెచ్1బీ ప్రారంభ రిజిస్ట్రేషన్ ఎంపిక ప్రక్రియ అధికారికంగా ముగిసిందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ ప్రకటించడంతో ఈ ఏడాది లాటరీ అంకానికి తెరపడింది. ఈ ప్రకటనతో ఎంపికైన అభ్యర్థులలో ఆనందం వెల్లివిరుస్తుంటే ఎంపిక కాని వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. ఎంపికైన వారు ఏప్రిల్ 1, 2026 నుంచి తమ పూర్తి స్థాయి పిటిషన్లను దాఖలు చేసుకునేందుకు వీలుంటుంది.

**కొత్త విధానం.. అవే సవాళ్లు**

ఈ ఏడాది లాటరీ ప్రక్రియలో అత్యంత కీలకమైన మార్పు ఏమిటంటే ఇది 'బెనిఫిషియరీ–సెంట్రిక్' లేదా వెయిటెడ్ లాటరీ విధానంలో పూర్తిస్థాయిలో నిర్వహించిన మొదటి చక్రం. గతంలో ఒక్కో అభ్యర్థి పేరుతో పలు కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల మోసాలకు తావుండేది. కానీ ఈసారి అభ్యర్థి పాస్‌పోర్ట్ ఆధారంగా కేవలం ఒక్కసారి మాత్రమే లాటరీలో పరిగణనలోకి తీసుకునేలా నిబంధనలు మార్చారు. వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ఈ మార్పు చేసినప్పటికీ అభ్యర్థుల సంఖ్యకు, అందుబాటులో ఉన్న వీసాల కోటాకు సుమారు 85,000 మధ్య ఉన్న భారీ వ్యత్యాసం వల్ల పోటీ ఏమాత్రం తగ్గలేదు.

**సోషల్ మీడియాలో భావోద్వేగాల వెల్లువ**

లాటరీ ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియా వేదికలు అభ్యర్థుల ఆవేదనతో నిండిపోయాయి. ముఖ్యంగా రెడిట్, లింక్డ్ ఇన్, ఎక్స్ వంటి వేదికల్లో నిరాశకు గురైన వారు తమ బాధను పంచుకుంటున్నారు. "నా జీవితంలో ఇంతగా ఎప్పుడూ ఏడవలేదు. నా ఆశలన్నీ ఈ లాటరీపైనే ఉన్నాయి. నా పరిస్థితి చూసి నా సహోద్యోగులు కూడా కన్నీళ్లు పెట్టుకోవడం నన్ను మరింత కుంగదీసింది " అని ఒక అభ్యర్థి చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.

ఇలాంటి హృదయవిదారక కథనాలు వందల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఓపీటీ కాలపరిమితి ముగిసిపోతున్న విద్యార్థులకు, ఇది చివరి అవకాశం కావడంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. అమెరికాలో స్థిరపడాలనే కల చెదిరిపోవడమే కాకుండా తీసుకున్న విద్యా రుణాలు, కెరీర్ ఎదుగుదలపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అనిశ్చితిలో భవిష్యత్తు**

ఈ ఏడాది లాటరీ ప్రక్రియలో జరిగిన ఆలస్యం కూడా అభ్యర్థులపై మానసిక ఒత్తిడిని పెంచింది. ఫలితాల కోసం నెలల తరబడి వేచి చూడటం, ఆపై ప్రతికూల ఫలితం రావడంతో చాలా మంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న విదేశీ నిపుణులు, ముఖ్యంగా భారతీయులు ఈ లాటరీ విధానం వల్ల ప్రతి ఏటా ఒక రకమైన 'జూదం' ఆడుతున్నట్లు అనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రత్యామ్నాయాల దిశగా అడుగులు**

ఎంపిక కాని అభ్యర్థులు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించక తప్పని పరిస్థితి నెలకొంది. మరికొంత కాలం చదువుకుంటూ పని చేసేందుకు వీలు కల్పించే విశ్వవిద్యాలయాల్లో చేరడం...కెనడా లేదా ఇతర దేశాలకు వలస వెళ్లడం.. వీసా నిబంధనలు సరళంగా ఉన్న దేశాలకు వెళ్లడం వీరి ముందున్న ఆప్షన్. భారతదేశం వంటి దేశాల్లో ఐటీ రంగం పుంజుకుంటున్న నేపథ్యంలో, సొంత ఊరికి వెళ్లి కెరీర్ నిర్మించుకోవడం బెటర్ అని ఆలోచిస్తున్నారు..మొత్తానికి 2027 ఆర్థిక సంవత్సరానికి లాటరీ ప్రక్రియ ముగియడం అనేది కేవలం ఒక పరిపాలనాపరమైన అంశం మాత్రమే కాదు.. ఇది వేలాది మంది యువత కలలు, ఆశలు భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశం. ఒక వైపు విజేతల సంబరాలు కనిపిస్తుంటే మరోవైపు నిరాశలో ఉన్న నిపుణులకు భరోసా ఇచ్చే వ్యవస్థ కావాలని మేధావులు కోరుతున్నారు.

# పెరిగిన విమాన ఇంధన ధరలు..




**మన ప్రజాగళం న్యూస్ :** పశ్చిమాసియా యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ఇప్పటికే రూపాయి విలువ పతనం కావడంతో సతమతమవుతుంటే, ఇప్పుడు విమాన ఇంధనానికి రెక్కలు రావడం సామాన్య, మధ్య తరగతి విమాన ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. జెట్ ఫ్యూయల్ ధర ఏకంగా రూ. 2 లక్షల మార్కును దాటడం విమానయాన చరిత్రలోనే ఇదే తొలిసారి. గతంలో రూ. 96,638 ఉన్న కిలో లీటర్ ధర, ఇప్పుడు రూ. 2,07,341 కి చేరడం అంటే అది ముమ్మాటికీ విమానయాన రంగానికి ఒక పెద్ద 'షాక్' అని చెప్పాలి.

జెట్ ఫ్యూయల్ రికార్డు ధర

విమాన ఇంధన ధరలు గతంతో పోలిస్తే రెట్టింపయ్యాయి. గత నెలతో పోలిస్తే అంతర్జాతీయ విమానాల ఫ్యూయల్ ధర 115 శాతం, దేశీయ విమానాల ఫ్యూయల్ ధర 107 శాతం పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం, రూపాయి బలహీనపడడం వల్ల చమురు కంపెనీలు విమాన ఇంధన ధరలను రికార్డు స్థాయికి పెంచాయి. ఇది విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాన్ని భారీగా పెంచేస్తుంది.

టికెట్ రేట్లు ఎంత పెరగొచ్చు?

ఒక విమానయాన సంస్థ మొత్తం ఖర్చులో ఇంధనానికే సుమారు 40 శాతం వరకు ఖర్చు అవుతుంది. ఇంధన ధరలు ఇలాగే కొనసాగితే, విమాన సంస్థలు 'ఫ్యూయల్ సర్‌చార్జి' పేరుతో టికెట్ ధరలను కనీసం 15 నుంచి 25 శాతం వరకు పెంచే అవకాశం ఉంది. ఏప్రిల్ లో సాధారణంగా ప్రయాణాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ధరలు పెరగడం వల్ల సామాన్యులు విమాన ప్రయాణాన్ని విరమించుకొని రైళ్ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

మనుగడ ప్రశ్నార్థకం!

ఇప్పటికే అప్పుల్లో ఉన్న కొన్ని విమాన సంస్థలకు ఈ ధరల పెరుగుదల 'గోరుచుట్టుపై రోకలిపోటు'లా మారింది. టికెట్ ధరలు పెంచితే ప్రయాణికులు తగ్గుతారు, పెంచకపోతే నష్టాలు వస్తాయి. ఈ సందిగ్ధంలో ఎయిర్ లైన్స్ సంస్థలు కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న నగరాలకు నడిపే విమానాల సర్వీసులను కొన్ని సంస్థలు రద్దు చేసుకునే ప్రమాదం కూడా లేకపోలేదు. దీనివల్ల ప్రాంతీయ విమానయాన అనుసంధానం దెబ్బతింటుంది. సరుకు రవాణా చేసే విమానాల ద్వారా అత్యవసర మందులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర కార్గో సేవల ధరలు కూడా పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాక తగ్గే అవకాశం ఉండడం వల్ల హోటళ్లు, టూరిజం రంగాలు కూడా దెబ్బతినవచ్చు.విమాన ఇంధన ధర రూ. 2 లక్షల మార్కు దాటడం అనేది ఒక గడ్డు కాలానికి సంకేతం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏటీఎఫ్ పై పన్నులను భారీగా తగ్గించకపోతే, సామాన్యుడికి ఆకాశ ప్రయాణం కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. యుద్ధ పరిస్థితులు సద్దుమణిగి చమురు ధరలు ఎప్పుడు తగ్గుతాయో అని ప్రయాణికులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి మాత్రం విమాన టికెట్ బుక్ చేసుకునే ముందు మీ బడ్జెట్‌ను ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది!

# సమంత 'పవర్ మార్నింగ్'..



## - వీడియోతో స్పెషల్ పోస్ట్!

స్టార్ హీరోయిన్ సమంత తన హెల్త్ మరియు ఫిట్‌నెస్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటుందో మనందరికీ తెలిసిందే. తాజాగా ఆమె తన 'పవర్ మార్నింగ్' రొటీన్‌ను అభిమానులతో పంచుకుంటూ ఒక స్పెషల్ వీడియో పోస్ట్ చేసింది. ఉదయాన్నే మనం చేసే పనులే ఆ రోజంతా మన మూడ్‌ను డిసైడ్ చేస్తాయని ఆమె నమ్ముతోంది. ఒత్తిడిని తగ్గించుకుని, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి ఆమె పాటిస్తున్న ఆ సింపుల్ ఫార్ములా ఏంటో ఇప్పుడు చూద్దాం.

**ఉదయాన్నే ఫోన్‌కు దూరంగా..:**

సమంత చెప్పిన మొదటి మరియు అతి ముఖ్యమైన రూల్ ఏంటంటే.. నిద్రలేవగానే గంట వరకు ఫోన్ ముట్టుకోకూడదు. ఇక సాధారణంగా మనం కళ్లు తెరవగానే వాట్సాప్ మెసేజ్‌లు, ఈమెయిల్స్ చూస్తూ ఒత్తిడికి గురవుతాము. కానీ సమంత మాత్రం నిద్రలేవగానే మన శరీరంలో ఉండే ఒత్తిడి హార్మోన్లను అదుపులో ఉంచుకోవడానికి ఫోన్‌ను పక్కన పెట్టేయాలని సూచించింది. ఇక అలా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండి, కొత్త రోజును ఆహ్వానించడానికి సిద్ధమవుతుందని ఆమె తన అనుభవాన్ని పంచుకుంది.

**ఆరోగ్యం కోసం ఈ సూత్రాలు:**

సమంత తన 'పవర్ మార్నింగ్'లో భాగంగా ఎనిమిది కీలక నియమాలను పాటిస్తోంది. నిద్రలేవగానే ఐదు నిమిషాల పాటు ధ్యానం చేయడం, కాసేపు సూర్యరశ్మి తగిలేలా కూర్చోవడం ఆమె దినచర్యలో భాగం. ఇక హెల్త్ డ్రింక్ విషయానికొస్తే.. గోరువెచ్చటి నీళ్లలో పసుపు, నిమ్మరసం కలిపి తాగుతుందట. అలాగే 11 గంటల లోపే వర్కౌట్లు పూర్తి చేసి, ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం వల్ల రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చని ఆమె వివరించింది.


**గోల్ సెట్టింగ్.. రాసుకోవడం అలవాటు:**

కేవలం శారీరక వ్యాయామమే కాదు, మానసిక స్పష్టత కూడా ముఖ్యమని సామ్ అంటోంది. ఆ రోజు మనం ఏం సాధించాలనుకుంటున్నాం, ఏ పనులు పూర్తి చేయాలి అనే విషయాలను ఒక పుస్తకంలో రాసుకోవడం ఆమెకు అలవాటు. ఇక దీనివల్ల సమయం వృధా కాకుండా, పనులన్నీ ఒక పద్ధతి ప్రకారం జరుగుతాయని ఆమె తెలిపింది. జీవితంలో నిజంగా మార్పు కావాలనుకునే వారు కనీసం 21 రోజుల పాటు ఈ 'పవర్ మార్నింగ్' పద్ధతిని ఫాలో అవ్వాలని ఆమె తన ఫాలోవర్లకు ఛాలెంజ్ విసిరింది.

**మీరూ ట్రై చేస్తారా?:** ఇక ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే సమంత, తన వ్యక్తిగత జీవితంలో పాటిస్తున్న ఈ చిన్న చిన్న మార్పులు ఎంతో ప్రభావం చూపుతాయని నిరూపించింది. సింపుల్ గా అనిపించినా, ఈ అలవాట్లు మనల్ని మానసికంగా, శారీరకగా దృఢంగా ఉంచుతాయనడంలో సందేహం లేదు. మీరు కూడా సమంతలాగా ఉత్సాహంగా ఉండాలనుకుంటే, రేపటి నుంచే ఆ 'పవర్ మార్నింగ్' మొదలుపెట్టేయండి.


# పాతిక వయసుకు టాటా..


## - 50 ప్లస్‌లో మలైకా జింతాత!



బాలీవుడ్ గ్లామర్ ప్రపంచంలో మలైకా అరోరా(52) పేరు ఒక బ్రాండ్. వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ 50 ప్లస్ లోను మెరుపులు మెరిపిస్తోంది ఈ బ్యూటీ. ఒక రకంగా చెప్పాలంటే టీనేజర్లు, పాతిక ప్రాయం అందగత్తెలకు 50 ప్లస్ మలైకా ఒక సవాల్ గా మారింది. తాజాగా జరిగిన గ్రాజియా ఫ్యాషన్ అవార్డ్స్ 2026 వేడుకలో మలైకా అరోరా మరోసారి అహూతులను మంత్రముగ్ధులను చేసింది. ఈ ఈవెంట్ కోసం తను ఎంచుకున్న డిజైనర్ సిల్వర్ గౌను ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. థై-హై స్లిట్ .. డీప్ నెక్ లైన్ తో కూడిన ఆ దుస్తుల్లో మలైకా ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం చూస్తుంటే.. తనను అసలైన -రెడ్ కార్పెట్ క్వీన్- అని అంగీకరించాలి.మలైకా ధరించిన ఈ ప్రత్యేకమైన డిజైనర్ డ్రెస్ తన ఫిట్‌నెస్‌ను పర్ఫెక్ట్‌గా ఎలివేట్ చేసింది. ప్రముఖ ఇంటర్నేషనల్ డిజైనర్ రూపొందించిన ఈ డ్రెస్ మోడ్రన్ స్టైల్‌కు నిలువుటద్దంలా నిలిచింది. మినిమల్ మేకప్ .. స్లీక్ హెయిర్ స్టైల్‌తో మలైకా తన లుక్‌ను చాలా క్లాసిక్‌గా నేచురల్ గా ప్రెజెంట్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలు చూస్తుంటే.. కెమెరా ముందు ఫోజులివ్వడంలో మలైకా ఎనర్జీ, గ్రేస్, స్టైల్ నేటి తరం హీరోయిన్లకు కూడా ఒక పాఠం అనడంలో సందేహం లేదు.

# ఐపీఎల్‌కు అన్‌ఆఫిషియల్ ఆంథమ్‌గా మారిన పాట



**మన ప్రజాగళం న్యూస్ :** నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది పారడైస్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉండగా, తాజాగా విడుదలైన మొదటి సింగిల్ 'ఆయా షేర్' ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఒక ప్రభంజనంలా మారింది. మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఈ ఊరమాస్ ట్యూన్, విడుదలైన క్షణం నుంచే చార్ట్‌బస్టర్‌గా నిలిచి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

సోషల్ మీడియాలో 'ఆయా షేర్' సునామీ

ఈ పాట సాధించిన విజయం సామాన్యమైనది కాదు. కేవలం యూట్యూబ్ వ్యూస్ పరంగానే కాకుండా, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ , ఎక్స్ వేదికలపై ఈ పాట టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. గ్రామీణ నేపథ్యం, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే పదజాలం, దానికి తోడు అనిరుధ్ మార్క్ ఎలక్ట్రిఫైయింగ్ ఆర్కెస్ట్రేషన్ కలవడంతో శ్రోతలు ఊగిపోతున్నారు. ముఖ్యంగా పాటలోని గర్జించే కోరస్ , బేస్ ఎలిమెంట్స్ మాస్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తున్నాయి.

ఐపీఎల్ ఫీవర్‌తో జతకట్టిన 'ఆయా షేర్'

ప్రస్తుతం దేశంలో ఐపీఎల్ సందడి నడుస్తుండటంతో క్రికెట్ అభిమానులు ఈ పాటను తమకు అనుకూలంగా మార్చుకున్నారు.

విరాట్ కోహ్లీ అగ్రెషన్, ఎంఎస్ ధోనీ ఎంట్రీ, రోహిత్ శర్మ సిక్సర్లకు బ్యాక్‌గ్రౌండ్‌లో 'ఆయా షేర్' పాటను జోడించి ఫ్యాన్స్ చేస్తున్న ఎడిట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్.ఆర్.హెచ్) అభిమానులు ఈ పాటను తమ టీమ్ థీమ్ సాంగ్‌లా భావిస్తున్నారు.

స్టేడియంలలో , సోషల్ మీడియా వేదికల్లో ఈ పాట హోరు వినిపిస్తుండటంతో ఇది ఐపీఎల్‌కు ఒక అన్‌ఆఫిషియల్ ఆంథమ్‌గా గుర్తింపు పొందింది.

లైవ్ కాన్సర్ట్‌లో అనిరుధ్ మేజిక్

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అనిరుధ్ లైవ్ కాన్సర్ట్ ఈ పాట స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. వేలాది మంది అభిమానుల మధ్య అనిరుధ్ ఈ పాటను లైవ్‌లో ప్రదర్శించగా ఆ ఎనర్జీకి స్టేడియం దద్దరిల్లిపోయింది. ఆ కాన్సర్ట్ క్లిప్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. సినిమా విడుదలకు ముందే ఒక పాట ఈ స్థాయిలో జనాల్లోకి వెళ్లడం 'ది పారడైస్' చిత్ర యూనిట్‌కు పెద్ద బూస్ట్‌గా మారింది.

కథా నేపథ్యం.. అంచనాలు

'దసరా' వంటి భారీ విజయం తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం గిరిజన పోరాటాల నేపథ్యంలో తెరకెక్కుతోంది. "అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే ఒక యోధుడిగా నాని ఈ చిత్రంలో కనిపించనున్నారు.

ఆయన పాత్రలోని తీవ్రతను ఉగ్రరూపాన్ని 'ఆయా షేర్' పాట అద్దం పడుతోంది.ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం, టాలీవుడ్‌లో మరో భారీ విజయాన్ని నమోదు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తానికి 'ఆయా షేర్' కేవలం ఒక పాటగా కాకుండా ఒక ఎమోషన్‌గా మారిపోయింది. అటు సినిమా రంగంలో, ఇటు క్రీడా రంగంలో ఈ పాట సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, నాని తన కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌ను అందుకోబోతున్నారని స్పష్టమవుతోంది.

# ఆ ఊపు, ఉత్సాహం ఎక్కడ పోయాయి? ఏమైంది?



**మన ప్రజాగళం న్యూస్ :** భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది ఒక ఎమోషన్. ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మొదలైందంటే దేశమంతా ఒక పండుగ వాతావరణం నెలకొంటుంది. అయితే, ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రంగం సిద్ధమైన వేళ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక రకమైన స్తబ్దత కనిపిస్తోంది. సాధారణంగా టోర్నీకి నెల రోజుల ముందే మొదలయ్యే సోషల్ మీడియా వార్స్, అడ్వర్టైజ్మెంట్ హడావిడి ఈసారి అంతగా కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సవాళ్లే.

సంక్షోభాల నీడలో ఐపీఎల్

ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపాయి. దీని పర్యవసానంగా భారతదేశంలో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడం.. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజల దృష్టి వినోదం కంటే కూడా రోజువారీ బతుకుదెరువుపైనే ఎక్కువగా ఉంది. దీనికి తోడు.. దేశంలోని ఐదు కీలక రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు రాజకీయ వేడిని పెంచాయి. టీవీ ఛానళ్లలో స్పోర్ట్స్ న్యూస్ కంటే పొలిటికల్ డిబేట్లు, ధరల పెరుగుదలపై చర్చలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ కారణాల వల్ల ఐపీఎల్ ప్రారంభం కావడానికి కొన్ని రోజుల సమయం ఉన్నా, ఆశించిన స్థాయిలో 'హైప్' క్రియేట్ కాలేదు.

క్రికెట్.. ఒక ఉపశమనం

ఇన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ.. ఐపీఎల్ మ్యాజిక్ మళ్లీ పుంజుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. భారతీయులకు ఒత్తిడిలో ఉన్నప్పుడు క్రికెట్ ఒక గొప్ప 'స్ట్రెస్ బస్టర్'గా పనిచేస్తుంది. ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు మైదానంలో అడుగుపెడితే.. స్టేడియాలు హోరెత్తడం ఖాయం. ఈ ఏడాది మ్యాచ్‌ల సంఖ్యను పెంచడం వల్ల అభిమానులకు ఎక్కువ రోజుల పాటు వినోదం లభిస్తుంది. ఇది బ్రాడ్‌కాస్టర్లకు కూడా కలిసి వచ్చే అంశం. తమ సొంత నగరాల్లో మ్యాచ్‌లు జరుగుతుంటే అభిమానుల్లో ఆ జోష్ మళ్లీ మొదలవుతుంది.మొత్తానికి ఐపీఎల్ 2026 ఒక సవాలుతో కూడిన ప్రయాణాన్ని మొదలుపెడుతోంది. ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ వేడి మధ్య క్రికెట్ తన ఉనికిని చాటుకోవాల్సి ఉంది. అయితే మొదటి కొన్ని సిక్సర్లు, వికెట్లు పడగానే జనం తమ కష్టాలను మర్చిపోయి మళ్లీ 'క్రికెట్ మత్తు'లో మునిగిపోయే అవకాశం మెండుగా ఉంది. డెడ్ హైప్‌తో మొదలవుతున్నా.. ఈ సీజన్ గ్రాండ్ సక్సెస్ అవుతుందని నిర్వాహకులు ధీమాగా ఉన్నారు.